క్లుప్తంగా

నేడు ఒంటిమిట్ట నడివీధి గంగమ్మ జాతర



ముస్తాబైన అమ్మవారి ఆలయ ప్రాంగణం

ఒంటిమిట్ట : గ్రామ భద్రతా దైవం, శక్తి స్వరూపిణీ అయిన గంగమ్మ జాతర గురువారం ఆలయ కమిటీ వారు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి చెక్కభజన, గంగమ్మ కథతో జాతర ప్రారంభం కానుంది. ఒకరోజు ముందుగానే ఊరిలో పండుగ వాతావరణం సంతరించుకుంది. అలానే గురువారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలిచిన ఆరుగురు విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందించనున్నారు. జాతరలో గ్రామ ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



గగన సింధు

పుల్లంపేట : మండల కేంద్రంలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న యు.గగన సింధు నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. మంగళవారం ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. మండల పరిధిలోని సీతారాంపేట గ్రామానికి చెందిన జానకీరామ్ కుమార్తె గగన సింధు సింధు నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంపై పాఠశాల కరస్పాండెంట్ కాసల భానుప్రసాద్, ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బ నరసింహులు, ప్రిన్సిపల్ టివి రాజశేఖర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డీఎం కార్యాలయంలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్నినిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎం రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరామర్శ



రోళ్లమడుగు నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : మండలంలోని తుమ్మల అగ్రహారానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రోళ్లమడుగు నాగేశ్వరరావు, మద్దిపాడు రామకృష్ణమనాయుడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం వారిని వేర్వేరుగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, జీవీ సుబ్బరాజు, దండు గోపి, ఓబయ్య, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

సిద్దవటం : మండలంలోని నేకనాపురం గ్రామ పంచాయతీలో జరుగుతున్న పంచాతీయరాజ్ పనులను పీఆర్ ఏఈ నాగరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేకనాపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులను, అలాగే పాఠశాల ఆవరణలో బండ పరుపు పనులకు రూ. లక్ష నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. పనులు ఎలా జరుగుతున్నాయో తనిఖీ చేశామన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

ఓబులవారిపల్లె : వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ద్వారా రైతులు పొందవచ్చని వ్యవసాయ అధికారిణి మల్లిక పేర్కొన్నారు. బుధవారం చెన్నరాజుపోడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిక మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు కోసం సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అరటి, బొప్పాయి పంటలకు సకాలంలో ఎరువులు వేసుకోవాలని సూచించారు. అనంతరం సేంద్రియ ఎరువుల వినియోగాన్ని రైతులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్ త్రివేణి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం తనిఖీ

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సదస్సులో రైతులు ద్వారా వచ్చిన 618 ఫిర్యాదులలో ఎన్ని పరిష్కారమయ్యాయో సిబ్బందిని ఆరాతీశారు. తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో 478 ఫిర్యాదులకు పరిష్కారం చూపమని, మిగిలిన 140 ఫిర్యాదులకు సంబంధించి రైతులు సరైన ధృవీకరణ పత్రాలను చూపకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయని ఆర్డీఓకు ఒంటిమిట్ట రెవెన్యూ అధికారులు తెలియజేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.

వేసవి వ్యాధులతో జరభద్రం



వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట టౌన్ : వేసవి కాలంలో కొన్ని రకాల వ్యాధులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తాయి. ఇదిలావుంటే గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది మార్చి ఆరంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రధానంగా చాలా ప్రాంతాల్లో చికెన్ పాక్స్ (ఆటలమ్మ) సోకి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలో వ్యాధులు, ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే కొన్ని మార్లు ప్రాణాపాయం కూడా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవిలో వచ్చే ప్రధానమైన వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

టైఫాయిడ్

అపరిశుభ్రమైన నీరు, కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల టైఫాయిడ్ వస్తుంది. అతిజ్వరం, అలసట, నిస్సత్తువ, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం టైఫాయిడ్ లక్షణాలని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

టైఫాయిడ్ బారీన పడకుండా ఉండాలంటే శుభ్రమైన నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. బయట దొరికే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఏమాత్రం లక్షణాలు ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

మలేరియా

మలేరియా ఆడ అనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. మూడు దశల్లో వ్యాధి ప్రభావం చూపుతుంది. మొదటి దశలో అధిక చలి, తలనొప్పి, వాంతులు, జ్వరం ఉంటాయి. రెండవ దశలో చర్మం వేడిగా, అధిక రక్తపోటు ఉంటుంది. మూడవ దశలో చెమటలు పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారాన్ని మితంగా తీసుకోవాలి. పై లక్షణాలు ఉంటే వైద్యుడిని సంప్రదించి వైద్యుడి సూచనల మేరకు మందులు వాడాలి.

అతిసార

అతిసార సోకిన వారికి నీళ్ల విరేచనాలు అవుతాయి. అతిసార వల్ల ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడతారు. సకాలంలో స్పందించకుంటే ప్రాణాలకే ప్రమాదం. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం, శరీరంలో నీటి శాతాన్ని కోల్పోవడం జరుగుతుంది.

జాగ్రత్తలు

నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. నిల్వవున్న ఆహారం, నీరు తీసుకోకూడదు. ఎలక్ట్రాల్ పౌడర్‌తో నీటిశాతం, లవణాలను పెంచుకోవచ్చు.

పచ్చ కామెర్లు

కలుషిత నీటివల్ల పచ్చకామెర్లు వస్తాయి. దీనిని హైపటైటిస్-ఏ అంటారు. మూత్రం పచ్చగా రావడం, కళ్లు పచ్చగా ఉండటం, చర్మంపై దురద, ఆకలి మందగించడం, జ్వరం, ఒళ్లు నొప్పులు ఉండటం వంటి లక్షణాలు ఉంటే పచ్చకామెర్లుగా భావించాలి.

అనుసరించాల్సిన జాగ్రత్తలు

శుభ్రమైన నీటిని తాగాలి. నూనె వినియోగం బాగా తగ్గించాలి. వైద్యులను సంప్రదించి వారి ఆదేశానుసారం కోర్సును పూర్తి చేయాలి.

చికెన్ పాక్స్

శరీరంపై నల్లని మచ్చలు వస్తాయి. ఈ వ్యాధి వేసవి కాలంలోనే వస్తుంది. శరీరం వేడిగా ఉంటుంది. ఒంటిపై బుడగలు తేలడం, దురద, ఆకలి తగ్గడం ఈవ్యాధి లక్షణాలుగా గుర్తించాలి.

ఇవి చేయాలి

చికెన్ పాక్స్ తగ్గడానికి కనీసం పది రోజుల సమయం పడుతుంది. వ్యాధిగ్రస్తులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. ఆటలమ్మ ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశముంటుంది. అందువల్ల చికెన్ పాక్స్ సోకిన వారికి దూరంగా ఉండటం మంచిది.

గవద బిళ్లలు

వైరస్ కారణంగా గవద బిళ్లలు వస్తాయి. లాలాజలం గ్రంధులకు వాపురావడం, జ్వరం, తలనొప్పి, ఆకలిలేకపోవడం ఈ వ్యాధి లక్షణాలు

జాగ్రత్తలు

ఈ వ్యాధి రాకుండా ఉండేందుకు ముందస్తుగా ఎంఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది.

వడదెబ్బ

ఎండకాలంలో ప్రమాదకరమైనది వడదెబ్బ. ఎండలో ఎక్కువగా ఉంటే శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేని స్థితికి చేరుకుంటుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, నీటిశాతం తగ్గి సత్తువలేని స్థితికి చేరుకోవడమే వడదెబ్బ. శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాలు గట్టిపడటం, చర్మం ఎర్రగా మారడం, వాంతి వచ్చినట్లు ఉండటం లేదా వాంతి చేసుకోవడం, మూర్ఛరావడం, తలనొప్పి, కోమాలోకి వెళ్లడం వంటి లక్షణాలు వడదెబ్బ సోకిన వారిలో కనిపిస్తాయి.

ఇవి తప్పక పాటించాలి

వడదెబ్బ సోకిన వారు వైద్యుల సలహాలతో మందులు వాడాలి. రోజుకు పది నుంచి పదిహేను గ్లాసుల నీళ్లు తాగాలి. పండ్లు, కొబ్బరినీళ్లు, మజ్జిగా ఎక్కువగా తీసుకోవాలి. మసాలాలు, కారం, నూనె, ఫాస్ట్‌ఫుడ్, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి.

ముందు జాగ్రత్తలు అవసరం



వేసవిలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి. ఈ ఏడాది ఎండలు మరింత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల ప్రజలు వేసవిలో సంక్రమించే వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. అన్నింటికంటే వడదెబ్బ బారీన పడకుండా చూసుకోవాలి. ఇది చాలా ప్రమాదకరమైనది. వీలైనంత వరకు ఎండలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిది. బయటకు వెళ్లడం తప్పని సరి అయితే బైక్‌లలో వెళ్లేవారు క్యాప్ ధరించాలి. పాదచారాలు గొడుగు ద్వారా ఎండ నుంచి రక్షణ పొందాలి. అలాగే వాటర్ బాటిల్ వెంటపెట్టుకొని అప్పుడప్పుడు నీరు తాగుతూ ఉండాలి.

- డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నమండెం : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ)2025 – 26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్ఓ అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలలో 6, 11 తరగతులలో ప్రవేశాలకు, 7 నుంచి 10, 12వ తరగతుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత ఉన్న బాలికలు ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బడి బయట పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్(బడి మానేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు చెందిన బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని లేదా చిన్నమండెం కేజీబీవీలో నేరుగా తెలుసుకోవచ్చన్నారు.

బాల్య వివాహాలు నేరం

గాలివీడు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, 18 సంవత్సరాల వయస్సు నిండిన తరువాత మాత్రమే ఆడపిల్లలకు వివాహం చేయాలని లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నూలివీడు పంచాయతీ కేంద్రంలోని సచివాలయంలో అంగన్వాడీ టీచర్లతో కిషోరి వికాసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రభుత్వం కఠినంగా ఉన్నదని, బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం పోషకాహారాలను ప్రదర్శించి వాటి విశిష్టతను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు సుజాత రెడ్డి, అరుణకుమారి, టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా పది పబ్లిక్ పరీక్షలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలలో నిర్వహించి పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు బుధవారం కట్టుదిట్టంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 244 మంది విద్యార్థులకు గాను 243 విద్యార్థులు హాజరయ్యారు. ఆదర్శపాఠశాల పరీక్షా కేంద్రంలో 177 మంది విద్యార్థులకు గాను 175 విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల అధికారులు తెలియజేశారు.

వీరబల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించినట్లు స్థానిక ఎస్‌ఐ మోహన్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పరీక్ష కేంద్రాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

సుండుపల్లె : మండల పరిధిలో బుధవారం జరిగిన పదవ తరగతి ఫిజిక్స్ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్స్ చీఫ్ జయన్న, ఓబులేసులు తెలిపారు. సుండుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 250కి 249 మంది హాజరై ఒకరు, అలానే జీకే రాచపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 259కి 258 హాజరై ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు

బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా



మృతుడి కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

రాజంపేట టౌన్ : అనుకోని పరిస్థితుల్లో మనిషి మరణిస్తే బీమా మృతుడి కుటుంబానికి ఆర్థికంగా భరోసా కల్పిస్తుందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆర్ఎస్ రోడ్డు బ్రాంచ్ మేనేజర్ కె.రవి తెలిపారు. మండలంలోని కొత్తపల్లెకు చెందిన సుబ్బారెడ్డి ఈ ఏడాది జనవరిలో మృతి చెందడంతో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద మృతుడి భార్య శిరీషకు బుధవారం మేనేజర్ రవి, బ్యాంకు అధికారులు రూ.2 లక్షల బీమా చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు అందజేస్తున్న బీమా సౌకర్యాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు



ఫిర్యాదులు అందుకుంటున్న చైర్ పర్సన్ వి.శ్రీనివాస్

ఒంటిమిట్ట : మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు తొమ్మిది ఫిర్యాదులు అందాయి. బుధవారం ఒంటిమిట్టలోని అటవీశాఖ విడిది గృహంలో ఏపీఎస్‌పీడీసీఎల్, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, ఆపరేషన్ కడప డివిజన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా చైర్మన్ వి శ్రీనివాస్, ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు డబ్ల్యూ విజయలక్ష్మిలు హాజరై ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అదాలత్ వివిధ సమస్యలపై తొమ్మిది ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్ రెఫర్ చేయడం జరిగింది. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో కడప విద్యుత్ ఈఈ హరి, ఒంటిమిట్ట డిప్యూటీ ఈఈ సుబ్రమణ్యం, ఏఈ ఉదయ్ కుమార్, సిద్దవటం ఏఈ జైచంద్ర, రాజంపేట ఏఏఓ శిరీషా, ఒంటిమిట్ట జేఏఓ దేవి ప్రసాద్, ఒంటిమిట్ట జేఈ ఆశాజ్యోతి, సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న మేస్త్రీలు



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మేస్త్రీలు

రాజంపేట రూరల్ : ప్రమాదవ శాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ముద్దా మల్లికార్జున కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూ.3.50 లక్షలు అందజేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర తెలియజేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రి ఆవరణలో బుధవారం మల్లికార్జున కుటుంబానికి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు మల్లికార్జునకు తల్లి, 3 చెల్లెళ్లు ఉన్నట్లు తెలియజేశారు. వారి జీవన భృతి కోసం మేస్త్రీ సోదరులైన మన్నే సాహెబ్, హుస్సేన్, సిలార్‌లు మానవత దృక్పథంతో రూ.3.50 లక్షలు వితరణ చేసినట్లు తెలియజేసినారు. అదే విధంగా ప్రకాశం జిల్లా నుంచి మల్లికార్జునను పనికి రాజంపేటకు తీసుకొచ్చిన మేస్త్రీ కొండయ్య తను ఇచ్చిన అడ్వాన్స్ రూ.లక్షపాటు అదనంగా లక్ష రూపాయలు నగదునిచ్చి ఆదుకున్నట్లు తెలియజేశారు. కార్మికుడు మల్లికార్జున కుటుంబానికి చేయూతనిచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దాసరి నరసింహులు



నందలూరు : మండలంలోని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో దాసరి నరసింహులు ఐదవసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఓవి కృష్ణారెడ్డి పరిశీలకులుగా వ్యవహరించగా దాసరి నరసింహులు, షమీవుల్లా ఖాన్‌లు పోటీ పడ్డారు. ఓటింగ్‌లో 21 మంది అడ్వకేట్‌లు పాల్గొనగా ఐదు ఓట్ల మెజార్టీతో దాసరి నరసింహులు గెలుపొంది బార్ ప్రెసిడెంటుగా ఎన్నిక కావడం జరిగింది. తన గెలుపునకు సహకరించిన సహ న్యాయవాదులు, మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంటుగా ఎన్నుకొన్న అనంతరం వైస్ ప్రెసిడెంటుగా షేక్ మహమ్మద్ అలీ, జనరల్ సెక్రటరీగా గొబ్బిళ్ల సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీగా నాయనపల్లి అనుదీప్, జైసింహ, ట్రెజరర్‌గా వినయ్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా స్వేచ్ఛ, లేడీ రిప్రజెంటేటివ్‌గా మాడపూడి నళిని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌గా ఓవి కృష్ణారెడ్డి, హెచ్ ఆనంద్ కుమార్ రెడ్డి, డి.మల్లికార్జున, ఆకేపాటి శివకుమార్ రెడ్డిలను ఎగ్జిక్యూటివ్ బాడీలుగా నియమించడం జరిగింది.

నేడు మండల ఉపాధ్యక్ష ఎన్నిక

ఒంటిమిట్ట : మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్ష పదవి ఎన్నికను నేడు గురువారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించినట్లు బుధవారం ఒంటిమిట్ట ఎంపీడీఓ కుళ్లాయి బాబు తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు-1గా ఉన్న జనార్దన్ రెడ్డి అనారోగ్యంతో గత ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన మృతి చెందారు.

తాజాగా ఉపాధ్యక్ష పదవి ఎన్నిక ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలందాయి. ఇక్కడ వైఎస్సార్ సీపీకి ఎనిమిది ఎంపీటీసీలు ఉండగా గంగపేరూరు నుంచి ఎన్నికైన పిడుగు రామలక్షుమ్మ కుటుంబ సభ్యులు, మంటపంపల్లి ఎంపీటీసీ సభ్యుడు సుంకేసుల బాషాలు గతేడాది టీడీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో ఎంపీపీ, మండల ఉపాధ్యక్షురాలు-2తో పాటు ఒంటిమిట్ట, పెన్నాపేరూరు, నర్వకాటిపల్లి, రాయగూడిపల్లి ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. పెన్నా పేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణ రెడ్డిని మండల ఉపాధ్యక్షుడు-1గా ఎన్నుకోవాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. గురువారం జరగబోయే మండల ఉపాధ్యక్షుడు-1 పదవి ఎన్నికల్లో ఏం జరుగుతుందో వేచి చూడాలి.

నేడు గ్రామ సభ

పుల్లంపేట : నేడు గురువారం మండల పరిధిలోని గారాలమడుగు పంచాయతీలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అరవింద కిషోర్ తెలిపారు. రెండో విడతలో రీసర్వేలో భాగంగా గారామలమడుగులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. అలాగే శుక్రవారం పుత్తనవారిపల్లి గ్రామంలో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.

తిరుమలలో అన్నమాచార్యుల ఇంటిని పునర్నిర్మించాలి

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ సత్యసాయి బాబా మందిరంలో పదకవితా పితామహుడు అన్నమయ్య 522 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో అన్నమాచార్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర స్వామి సౌజన్యంతో అన్నమయ్య సంకీర్తన ఆలాపనను తుమ్మల హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి మీద 32 వేల సంకీర్తనలు రచించి గానం చేసిన ఘనత శ్రీ అన్నమాచార్యులకు దక్కుతుందన్నారు. అలాంటి అన్నమాచార్యుల ఇంటిని తిరుమల కొండపై కూల్చివేశారని తిరిగి ప్రభుత్వం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం అన్నమాచార్యుల వారి సంకీర్తలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, వాయిద్య కళాకారులు పాల్గొన్నారు.

పన్నులపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట : పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఇంటిపన్ను, ఖాళీస్థలం పన్నులు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీపై 50శాతం రాయితీ ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఇన్‌చార్జి కమిషనరు ఈశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా కేంద్రం, వార్డు సచివాలయం, మున్సిపల్ కార్యాలయంలోగాని చెల్లించవచ్చునన్నారు. ఆన్‌లైన్ ద్వారా 31.03.2025లోగా మొత్తం పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ప్రభుత్వ సెలవ దినములలోనూ వార్డు సచివాలయం, మున్సిపల్ ఆఫీసు పన్నులు కట్టించుకోనబడునన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించండి

సంబేపల్లె : రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని ఉపాధి ఏపీడీ మధుబాబు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నీటితొట్లు, సేద్యపు నీటికుంటలు, పంట కాలువలను పునరుద్ధరించడంతో పాటు రైతులకు ఉపయోగపడే పనులను చేయాలని తెలిపారు. కూలీలకు ఎండ తీవ్రత ఉంటుందని వారి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, ఏపీఓ రెడ్డి జవహర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దూదేకుల అభ్యున్నతికి తోడ్పాటు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం మైనార్టీలు

రాయచోటి అర్బన్ : ముస్లింలకు పవిత్రమైనది రంజాన్ మాసమని దూదేకుల, నూర్‌బాషా ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సిద్దయ్య, దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పకీర్ సాహెబ్‌లు అన్నారు. బుధవారం ఆ సంఘం కార్యాలయం వద్ద ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దైవానికి దగ్గర ఉండేందుకు ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. ఉపవాసాలు ఉండటమే కాక రోజూ ఐదుసార్లు నమాజ్ ఆచరించి దేవుడు (అల్లాహ్) ఏర్పాటు చేసిన నియమ, నిబంధనల అనుసరిస్తూ ఎలా జీవించేలా తెలియజేసే సమయమని పేర్కొన్నారు. పవిత్రమైన రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలానే తమ సంఘం ఆధ్వర్యంలో దూదేకుల అభ్యున్నతి తోడ్పాటును అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాలగిరి దర్బార్‌బాషా, కొండూరు మహమ్మద్‌రఫీ, ఇనాయతుల్లా, జాఫర్, సిద్దయ్య, గాండ్లపెంట ఖాదర్‌బాషా, నాగరాజు, షామీర్, సత్తార్, ప్రకాష్, లక్కిరెడ్డిపల్లె మహమ్మద్, మన్సూర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే ఆకేపాటి ఇఫ్తార్ విందు



గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న మైనార్టీ నాయకులు

రాజంపేట రూరల్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి 28వ తేదీ శుక్రవారం ఇఫ్తార్ విందు అందించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎండీ జాహీద్ అలీ తెలియజేశారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో బుధవారం ఇఫ్తార్ విందు గోడపత్రాలను మైనార్టీ నాయకులతో కలసి జాహీద్ అలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే ఆకేపాటి ఇఫ్తార్ విందు ఇవ్వటం హర్షనీయమన్నారు. అదే విధంగా శుక్రవారం సాయంత్రం తిరుపతి రోడ్‌లోని వజ్రం కల్యాణ మండపంలో అందించే ఈ ఇఫ్తార్ విందులో నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు పఠాన్ ఖాజా మొహిద్దీన్, పట్టణ అధ్యక్షులు మసూద్ అలీఖాన్, సీనియర్ నాయకులు నజీర్ అహమ్మద్, ఇలియాస్, సత్తార్, డీఆర్ అంజద్ అలీఖాన్, నాసిర్, షాకీర్, రహమతుల్లా, మౌలా, దర్బార్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడండి



ట్రాన్స్‌కో ఎస్ఈకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

రాయచోటి అర్బన్ : రంజాన్ పండుగలో భాగమైన బడే రాత్ సందర్భంగా గురువారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాయచోటి పట్టణ కాంగ్రెస్ నేతలు విద్యుత్‌శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ బాబాసర్దార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖరరెడ్డిని కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గురువారం ముస్లిం మైనార్టీలు బడేరాత్ (పెద్దరాత్రి)ను నిర్వహించుకుంటారన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మసీదులలో రాత్రంతా భక్తి శ్రద్ధలతో నమాజ్‌లు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలంటూ కోరారు. ఈ మేరకు ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సయ్యద్‌అలీ, పఠాన్ ఖాదర్‌ఖాన్, ఇబ్రహీం, ముబారక్, మహమ్మద్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా

నందలూరు : మండలంలో తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌లో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మంచినీటి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు సంబంధించి వివిధ సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. ఎంపీ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడే రీతిలో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్లకు జిగురు అట్టలను అమర్చాలి



పెనగలూరు: మామిడితోటలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శారద

రైల్వేకోడూరు అర్బన్/పెనగలూరు : రైల్వేకోడూరు, పెనగలూరు మండలాల్లోని శెట్టిగుంట, చియ్యవరం, ఈటమాపురం, సిద్దవరం తదితర గ్రామాలలో ఉద్యానశాఖ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శారద, హెచ్ఓలు భాస్కర్, సురేష్ బాబు తదితర అధికారులు మామిడి తోటలను పరిశీలించి క్షేత్రస్థాయిలో తెగుళ్లు వాటి నివారణ, పంటలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మామిడిలో ఉన్న నల్లతామర, తేనెమంచు పురుగు ఉధృతి ఉన్నట్లు తెలిసిందన్నారు. కావున రైతులు నివారణ నిమిత్తం నీలిరంగు జిగురు అట్టలను ప్రతి చెట్టుకు అమర్చుకోవాలని సూచించారు. మామిడి రైతులు తోటల్లో గమనించిన సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి తగిన నివారణలు అధికారుల సూచనలు మేరకు పాటించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, మామిడి రైతులు పాల్గొన్నారు.